# శ్రీ ఐరేని లింగయ్య

శ్రీ ఐరేని లింగయ్య ఆరవ శాసనసభ (1978-1983) డెప్యూటీ స్పీకర్‌గా 1982, సెప్టెంబరు 8న ఏకగ్రీవంగా ఎన్నికై 1983, జనవరి 7 వరకు ఆ పదవిని నిర్వహించారు.

వీరు మెదక్ జిల్లా దుబ్బాక గ్రామంలో 1918 వ సంవత్సరంలో జన్మించారు. వీరు నైజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నారు.

శ్రీ లింగయ్య 1958 వ సంవత్సరం నుండి 1972వ సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్ విధాన పరిషత్ సభ్యులుగా ఉన్నారు. వీరు 1978 వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో మెదక్ జిల్లా దొమ్మాట నియోజక వర్గం నుండి రాష్ట్ర శాసనసభకు మొదటిసారి ఎన్నికైనారు. వీరు శాసనసభా కార్యకలాపాలను ఎంతో సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి సభా గౌరవాన్ని , హుందాతనాన్ని నిలబెట్టి అన్ని పక్షాల సభ్యుల ఆమోదాన్ని పొందారు.

శ్రీ లింగయ్య 1983 వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో కూడా దొమ్మాట నియోజకవర్గం నుండి శాసనసభకు రెండవసారి ఎన్నికైనారు.

వీరు 1991, ఏప్రిల్ 1న మరణించారు.

## శ్రీ ఐరేని లింగయ్య డెప్యూటీ స్పీకరుగా ఎన్నికైన సందర్భంగా చేసిన ప్రసంగం

అధ్యక్షా, ఈ రోజు ఈ శాసన సభలో డెప్యూటీ స్పీకరుగా ఏకగ్రీవంగా నన్ను ఎన్నుకున్నందుకు వారిని నేను అభినందిస్తూ వారందరికి కృతజ్ఞత  చెప్పుతున్నాను. యూనివర్సిటీ డిగ్రీలు చదువుకుని పోలిటిక్సు చదువుకుని మేము పోలటిక్సులోనికి వచ్చిన వారము కాదు, మేము ప్రజలతో పోలటిక్సు నేర్చుకున్నాము. ప్రజల భాషలో మాట్లాడుతాము. అదే నా స్వభావము అలవాటు. మేము చదువుకున్నది వీధి బడిలో, ఏ భాషలో మాట్లాడినా ప్రజలు నన్ను ఎట్లా గౌరవిస్తారో నాకు తెలుసు. ముఖ్యమంత్రిగారు నన్ను డెప్యూటీ స్పీకరుగా నామినేషను వేయమని చెప్పారు. నేను వారికి నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మిత్రులు అందరు నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు వారికి నా హృదయపూర్వక అభినందనలు తెల్పుకుంటున్నాను.